
# తెలుగు పలహారం

ఎన్. సూరి

''విస్తరి ముందు పీటవేసుకుని కూర్చున్నంత తేలిక కాదు... జీవితంలో నెగ్గుకు రావడం అంటే! తింటున్నంతసేపూ పీటా విస్తరీ నీ అధికారం కింద ఉంటాయి. నువ్వు చెప్పినట్టు ఉంటాయి. జీవితం అలాంటిది కాదు. మడికట్టుకున్న నానమ్మ దూరం నుంచి కొబ్బరి పచ్చడి వేసినట్టు పరమాత్మ మన కంచంలో ఎప్పుడేం వేస్తాడో తెలీదు. వేసిందల్లా తినడమే కానీ కోరి వడ్డించుకోవడం సాధ్యపడే పనికాదు.''




''శాస్త్రీ! చెబితే జీవితం గురించి చెప్పు. లేదా కొబ్బరి పచ్చడి గురించి చెప్పు. అంతేకానీ పులుసు కూరలో పాయసంలా అసయ్యమైన కాంబినేషన్లు కలపకు. కావాలంటే ఆ పచ్చడి మరికాస్త కలుపుకో.''

''వద్దు బావా! తియ్యగుమ్మడి పులుసు తిని చచ్చిపోవాలని నా కోరిక.''

''ఒరే అబ్బాయ్.... త్వరగా శాస్త్రి గారికి పులుసు పోసేయ్. ఆయన కవతల అర్జెంటు పనుందంట.''

ఆ బావ, బావమరుదులి ద్దలిద్దరి ముచ్చట్లు, వాళ్లి




ద్దరూ భోజనం చేస్తున్న వైనం చూడడానికి, వినడానికి కూడా సరదాగా ఉంది. శంకరం గారు మాకు పాత కస్టమరే. ఈ శాస్త్రిగారే కొత్త వ్యక్తి. పులుసు పోస్తుంటే 'పెరుగులోకి మరి రెండు ముక్కలు' అని అడిగాడు.... వేశాను.

గుమ్మడి తొక్క పారేసి, ముక్కని పులుసులోనే కలుపుకోబోతూ ఆత్రపడి ఓ ముక్క నోట్లో వేసుకుని అడిగాడు శాస్త్రిగారు ''బావా! పులుసుకి ఈ రుచి ఎక్కడి నుంచి వచ్చిందంటావ్? మొదట్లో వేసిన ముక్కల్లోంచా.... పోపులో వేసిన ఇంగువలో నుంచా?''

''కాదోయ్ చెవలాయ్... చిగుర్న వేసిన కరివేపాకు లోనుంచీ.... కాచిన గిన్నెలోనించీని. గిన్నె అంటే ఏదో అనుకునేవ్ .... రాచిప్ప. దానిలో మరిగిన పులుసు, పప్పు వాటి టేస్ట్ మరి దేనికీ రాదు. కావాలంటే ఆ కుర్రాణ్ణి కనుక్కో.'' అంటూ నావైపు చూపించాడు.

అవునన్నట్టు తలూపాను నేను.

''మట్టికుండలో నీటి రుచి రిఫ్రిజిరేటర్ నీళ్లకి ఎలా రాదో.... రాచ్చిప్పలో మరిగిన పులుసు రుచి మరిదేనికీ రాదురా శాస్త్రీ! అసలు ఒక్కో వంటకానికి ఒక్కో పాత్ర, కలియబెట్టడానికి ఒక్కో తరహా వంటకానికి ఒక్కో గరిటె.... తెలుగువాడి టేస్టుకి ఒకటి.... మన వాడి చాదస్తానికి ఒకటి.... నమస్తే!''

''అది సరే బావా! రాచిప్పలు, ఇనప అట్లకాడలు ఈకాలంలో ఈ హోటల్ వాడికి ఎక్కడ దొరికాయంటావ్?''

''అదేకదా ఈ హోటల్ ప్రత్యేకత. వచ్చేటప్పుడు బయట బోర్డు చూడలా 'తెలుగు ఫలహారం' అని.... అన్నీ తెలుగు వంటకాలే ఉంటాయిక్కడ.''

''అవును బావా! మావిడికాయ పప్పు మొదలు తిన్నవన్నీ తెలుగు వంటకాలే. పనసపొట్టు కూర, దోసకాయ మూనబద్దల కూర, కాకరకాయ పులుసు కూర, పులిహోర గోంగూర, కొబ్బరిపచ్చడి, పులుసు... అబ్బీ పెరుగు. ఆ... అవును కానీ మొదట్లో అప్పడం వేశాడు. అప్పడం దప్పళం తమిళం వాడివి కానీ తెలుగువి ఎలా అవుతాయ్?'' లాపాయింట్ లాగాడు శాస్త్రిగారు.

''అవును. తమిళనాడువే అనుకో. కానీ ఆ అప్పడాన్ని పప్పులోనే నమిలేశావ్ కానీ అరవ్వాడిలా సాంబార్‌లో నానబెట్టుకుని తినలేదుగా నువ్వు? మనలో కలగలిసి పోయిన వాటిని విడదీసి వదిలేసుకోమనడం లేదు... అతకని వాటిని బలవంతాన అలవాటు చేసుకోవద్దంటున్నారు. అచ్చంగా మనవే బాగుండేటప్పుడు పొరుగింటి పుల్లకూర కోసం పాకులాడద్దంటున్నారు. దశాబ్దాలుగా జివజచ్చి ఉన్న సిటీ నాలుకలకు మళ్లీ ఇన్నాళ్లకు అచ్చ తెలుగు వంటకాలతో జీవం పోస్తున్నారు వీళ్లు.''

''బాగుందనుకో.... పదార్థాలు కూడా యమ రుచిగానే ఉన్నాయనుకో. తాజానెయ్యి, అరిటాకులు... ఏర్పాట్లన్నీ బాగున్నాయే అనుకో. కానీ మరీ ఈ పీటల మీద భోజనమే.''

''బొజ్జాగిజ్జా పెరిగి బొడ్డులోతుకెళ్లిన నీలాంటి వాళ్లకి కాస్త కష్టంగానే ఉంటుంది మరి. కానీ ఇక్కడ వంటకాలు, వడ్డనలు అన్నింటా నూటికి నూరు నయాపైసలా తెలుగు సంప్రదాయమే. అందుకే కదా ఉగాది పూటా వచ్చిన అతిథికి ఇంటిభోజనం మాన్పించి ఇక్కడికి తీసుకువచ్చింది.''

''కానీ ఈ కాలం కుర్రాళ్లకి ఇవన్నీ నచ్చుతాయా?''

''వెరైటీ కోసమని వచ్చేవాళ్లు, రుచిమరిగి వచ్చేవాళ్లు... ఆవిరికుడుములు, దిబ్బరొట్టెలు, పిండి, గుంటపొంగడాలు లొట్టలేస్తూ తినే కాలేజీ కుర్రాళ్లు పొద్దున్నా, సాయంత్రం ఈ వీధి కొసకంటా నిలబడతారు. అదీకాక ఇక్కడికొచ్చి భోజనం చేసేవాళ్లు ఎక్కువమంది ఉండరు. ఇంట్లో అన్నం మాత్రమే వండుకుని కూరలు ఇక్కడినుంచి పట్టుకుపోతారు. ఇప్పుడు తెలుగు నగరాల్లో ఇది లేటెస్టు ఫ్యాషన్. సందుకు మూడుంటాయి 'కర్రీ పాయింట్'. ఒకరకంగా ఇదీ అలాంటిదే.''

''నిజమే అనుకో''

''చెయ్యి కడుక్కో'' అంటూ లేచాడు శంకరం గారు.

గత మూడు సంవత్సరాలుగా హైదరాబాద్‌లో తెలుగు ఫలహారం రుచిచూడని తెలుగు వాడు లేడు. ఓ వెరైటీ ట్రై చేద్దామని వచ్చేవాళ్లలో తెలుగువాళ్లు కానివాళ్లు కూడా ఉంటారు. మరికొంతమంది మాకు రెగ్యులర్ కస్టమర్లు.

ఇద్దరూ చేతులు కడుక్కుని హాల్లోకి వచ్చారు.

''బావా ఐడియా! అమ్మడి పెళ్లికి వంటలన్నీ ఈ హోటల్ వాళ్లకి కాంట్రాక్టిచ్చేస్తాను. ఏమంటావ్?''

''బానే ఉంటుందనుకో!''

''మరింకేం మాట్లాడిపెట్టు'' అంటూ నన్ను పిలిచాడు శాస్త్రిగారు.

''మీ ఓనర్ ఎక్కడోయ్....''

''.......''

''మీ ఓనరెక్కడయ్యా అంటే మాట్లాడవేం?''

''ఆయన లేరండీ.''

''ఇన్నాళ్లనుంచీ చూస్తున్నాను. ఒక్కసారీ కనిపించడేమయ్యా ఆయన.... ఎక్కడుంటాడసలు?''

''.........''

''వచ్చే నెల్లో ఢిల్లీలో మా అమ్మాయి పెళ్లి. వంటల కాంట్రాక్టు ఒప్పుకుంటాడా?''

''తెలీదండి.''

''సర్లే.... రేపు మళ్లీ వస్తాం. కనుక్కుని చెప్పు'' అంటూ వెళ్లిపోయారు వాళ్లిద్దరూ.

నిజానికి శాస్త్రిగారితో అబద్ధం చెప్పాన్నేను. ఈ

కాంట్రాక్టు పెదనాన్న ఒప్పుకోడు. ఇదేకాదు.... మూడేళ్లుగా ఆయన ఎక్కడా ఏ కాంట్రాక్టూ ఒప్పుకోలేదు. రోజూ వచ్చే శంకరం గారికే కాదు... ఆయన సాయం పొందిన వాళ్లకి కూడా ఆయనెవరో సరిగ్గా తెలీనే తెలీదు.

నాతో సహా తెలుగు ఫలహారంలో పాతికమందిదాకా పనిచేస్తూ ఉంటారు. అందరూ ఉపాధి కోసం ఇక్కడికి వలస వచ్చినవాళ్లే. అందరూ చదువుకున్న నిరుద్యోగులే. దాదాపుగా వాళ్లంతా నగరంలో రకరకాల మోసాలకు గురైన వాళ్లే. ఏదో ఒక ఉద్యోగమో, ఆధారమో దొరికేవరకు ఇక్కడ ఆశ్రయం పొందుతారు. వాళ్లకి కూడా పెదనాన్న పేరుకూడా తెలీదు.

గత మూడేళ్లుగా ఎవ్వరితోనూ ఆయన పన్నెత్తి మాట్లాడలేదు. ఇక్కడ ఉన్నంతసేపూ పొయ్యి దగ్గరే ఉంటాడు. మర్నాటికి ఏవేం కావాలో లిస్టు రాసిచ్చేస్తాడు. అవి తీసుకురావడం, హోటల్ నడుపుకోవడం మా కుర్రాళ్లందరి బాధ్యత.

తినే పదార్థం రుచి ఎలా ఉందో చూస్తారు గానీ, వండేవాడి జీవిత చరిత్ర ఎవడిక్కావాలి? అందుకే తెలుగు ఫలహారం ఎందుకు, ఎలా వెలిసిందనేది ఇప్పటివరకు చెప్పుకునే అవసరం లేకుండా గుప్తంగానే ఉండిపోయింది.

★★★

చేతిలో మిగిలిన డబ్బుకి వచ్చింది ఒకేఒక్క కర్రీపఫ్. దాన్ని రూంలోకి తీసుకొచ్చి జాగ్రత్తగా రెండు ముక్కలుగా కోసి చెరో ముక్కా తినబోతుంటే అనిపించింది. 'ఇదే షాపులో తింటే సాస్ కూడా వేసేవాడు కదా' అని. ఆ మాటే పైకి అన్నాను.

'ఆగరా' అన్నాడు వాడు. సీసాలోంచి పచ్చడి తీసి ప్లేట్లో వేశాడు. 'కొంచెం ఎక్కువ నంజుకో... దబ్బకాయ పచ్చడి. పైత్యం తగ్గిస్తుంది. వాంతి కాకుండా ఉంటుంది. కడుపులో మంట పుడుతుందనుకో. అది వేరే సంగతి.''

ఇద్దరం పనిచేస్తున్న కంపెనీలో రెండు మూడు నెలలకు ఒకసారి కూడా జీతాలిచ్చే అలవాటు లేదు. రేపోమాపో మూడపడబోయే కంపెనీలో పని చేయాల్సి రావడం కంటే పెద్దనరకం మరోటి లేదు. కంపెనీ పరిస్థితి ఒకసారి బయటికి పొక్కితే అదే రంగంలోని మరో కంపెనీ ఏదీ ఆ కంపెనీ ఉద్యోగులకు అవకాశాలివ్వదు. రేపోమాపో అదికాస్తా మూతపడితే వీళ్లందరినీ చౌకగా రాబట్టొచ్చని ఎదురు చూస్తుంటాయి. ఇదో రకం పాలిటిక్స్. మరోచోటికి పోవడానికి లేదు.... ఉన్నచోట పనిలేదు. అన్నింటి కంటే ముఖ్యం రోజుల తరబడి చేతిలో చిల్లిగవ్వైనా లేదు.

పస్తు పడుకున్న రోజుల్లో దబ్బకాయ పచ్చడే గతి. పది రూపాయలు చేతిలో పడితే చాలు.... మా గోపిగాడి హడావుడికి అంతుండదు. పది రూపాయలకు ఇన్ని వెరైటీలా అని ఆశ్చర్యపోతూ ఆబగా తింటున్నప్పుడు కూడా కంచంలో దబ్బకాయ పచ్చడే ముందు వేసేవాడు.

'దొరికింది కదాని గబగబా మెక్కేస్తే మాడిన పేగులు అరాయించుకోలేవురా. ముందు కాస్త పులుపు తగలనీ.'' అనేవాడు.

కడుపునిండా తిన్నా, నీరసాన ఓ పక్క ఒళ్లు తేలిపోతుంటే, మంచినీళ్లు తాగి లైటు తీసేశాక పక్కనే పడుకుని గోపీ చెప్పేమాట....

నగరం బతకనిస్తుంది. కానీ బతుకునివ్వదు.

గోపీది, నాది ఒకటే ఊరు. చిన్నతనం నుంచి ఒక్కటిగా కలిసి పెరిగాం. మా ఇద్దరికీ దూరపు బంధుత్వం కూడా ఉంది. బంధుత్వం కన్నా మిన్నగా స్నేహబంధమే మమ్మల్ని ఎక్కువ లాలించింది. వాడికి తల్లిలేదు. వాళ్ల నాన్న వాణ్ణి తల్లి, తండ్రి తనే అయి పెంచాడు. తల్లి చేయాల్సిన సేవలన్నీ తానే చేస్తూ ఆ లోటు తెలీకుండా చూసుకున్నాడు. వాడికోసం ఇవి చేయగలను... ఇది చేయలేను అనే పరిమితులేవీ పెట్టుకోకుండా సమస్తం చేశాడు.

'పెద్దమ్మ ఉన్నంతకాలం శతపోరు పెట్టింది. ఎన్నో సంబంధాలు వచ్చాయ్. మళ్లీ పెళ్లి చేసుకోను గాక చేసుకోను అని ఒట్టుపెట్టుకున్నాడు వాడు. కొడుకు తప్ప మా అన్నయ్యకి మరో వ్యాపకమూ లేదు.... వ్యసనమూ లేదు' అనేవాడు మా నాన్న గోపీ తండ్రి ప్రస్తావన వచ్చినప్పుడల్లా.

చదువకునే రోజుల్లో లంచ్‌బాక్స్‌లు మార్చుకుని తినేవాళ్లం. 'మీ అమ్మచేతి వంట అమృతంరా. నీ పుణ్యాన రోజులో ఒక పూటైనా తినగలుగుతున్నాను' అనేవాడు వాడు. 'నాకు మాత్రం రెండు పూటలా అదే' అనేవాడ్ని నేను సంతోషంగా.

''నేను ఉద్యోగం వదిలేస్తున్నాను'' స్థిరంగా చెప్పాను.

''ఏం?''


''కొత్త ఉద్యోగం దొరికిందిరా''

''ఎక్కడా.... ఏ ఉద్యోగం?'' ఆత్రంగా అడిగాడు వాడు.

''అమీర్‌పేటలో ఓ ఎడ్యుకేషనల్ కన్సల్టెన్సీ. అందులో కంప్యూటర్ ఆపరేటర్.''

''ఎందుకురా తొందరపడి ఇలాంటి చౌకబారు ఉద్యోగాల్లో చేరడం? కొన్నాళ్లు ఓపిక పడితే....''

''ఇక నా వల్లకాదు. ఇప్పట్లో మంచి ఉద్యోగం వచ్చే అవకాశం లేదు. జీతాల్లేని నౌకరీ నేను చేయలేను. ఇందులో మాత్రం తప్పేముంది?'' అంటూ మొండిగా వాదించే సరికి ఏమీ అనలేక ఊరు



కున్నాడు వాడు.

నగరానికి వచ్చిన కొత్తల్లో సరే... ఇంటి దగ్గర నుంచి డబ్బు తెప్పించుకునే వాళ్లం. ఇప్పుడు అడగాలంటే సిగ్గుగా ఉంటుంది. కిందటిసారి అడిగినప్పుడే.... ఇదే ఆఖరుసారని, తనకు ఇంక ఇచ్చే శక్తి లేదని మా నాన్న తేల్చి చెప్పేశాడు.

ఈ కొత్తజాబ్‌లో చేరిన తర్వాత పరిస్థితి కాస్త మెరుగైంది. గోపీకూడా పాత ఆఫీస్‌కి రాజీనామా చేయలేదు కానీ, ఏవో చిన్నచిన్న పార్ట్‌టైం జాబ్‌లు చేస్తున్నాడు. అయినప్పటికీ ఇద్దరికీ వచ్చే డబ్బుల్తో ఓపూట మస్తు మరోపూట పస్తుగానే గడుస్తోంది.

ఉదయం ఎనిమిది గంటలవుతోందనా ఎవరో తలుపు కొట్టిన చప్పుడైతే వెళ్లి తీశాను. ఎదురుగా పెదనాన్న నిలబడి ఉన్నాడు. మనిషి చాలా సీరియస్‌గా ఉన్నాడు. చటుక్కున లోపలికి వచ్చి కొడుకు వంక ఒకసారి తేరిపార చూశాడు. గదంతా కలయ చేశాడు. కుశల ప్రశ్నలు అడగబోయేంతలోనే 'ఒరే మీరు నాతో రండి' అంటూ మమ్మల్ని బయటకు తీసుకుపోయాడు. బియ్యం, కూరలు, ఇతర వంట సామగ్రి అంతా కొన్నాడు. గంట తిరిగేసరికి వంట పూర్తిచేసి కంచాల్లో వడ్డించాడు.

మేమిద్దరం ఆవురావురని తింటుంటే, తన కళ్లల్లో నీళ్లు తిరుగుతుండగా అప్పుడడిగాడు.... ''తినడానికి కూడా లేకుండా ఏమిట్రా ఇదీ'' అని.

''లేదు నాన్నా.... నిన్న రాత్రే బియ్యం అయి పోయాయ్. ఏరా!'' గోపీ ఏదో సర్దిచెప్పబోయాడు.

''నోర్ముయ్... మీ సంగతులన్నీ తెలిసే వచ్చాను. 'నీ కొడుకు వాలకం ఎలాగుందో వెళ్లి చూసుకో' అని పరాయి వాడెవడో వచ్చి చెప్పేంతవరకు దాచి పెట్టాల్సిన అవసరం ఏమొచ్చిందిరా నీకు?'' పెదనాన్న కంఠంలో బాధ, ఆవేశం, నిస్సత్తువ, కోపం, కొడుకుపై అవ్యాజమైన ప్రేమ కలగలిసి వినిపిస్తున్నాయి. ఆ తండ్రికొడుకుల కళ్లవెంట నీటిధారలు కనిపిస్తున్నాయి. ఆ పూట నాక్కూడా అమ్మలా పెదనాన్నే కొసరి కొసరి తినిపించాడు.

ఇక్కడి పరిస్థితులన్నీ ఆసాంతం విన్నాక అడిగాడు.

''మరో మంచి ఉద్యోగం ఎందుకు రాదు?

''క్వాలిఫికేషన్లు చాలవు.''

''ఇన్నాళ్లూ చదివిందంతా ఏమైనట్టు?''

''సాఫ్ట్‌వేర్ రంగంలో అటువంటిదేమీ ఉండదు పెదనాన్నా. అమెరికావాడు రోజుకో కొత్త సాఫ్ట్‌వేర్ కనిపెడతాడు. దాన్ని వెంటనే దిగుమతి చేసుకుని కోర్సులు చెప్పి, ఇక్కడి కాలేజీలు ఫీజులు దండు కుంటాయి. విద్యార్థి బయటకు వచ్చేలోపలే మరో కొత్త కోర్సు వస్తుంది. కొత్తది రావడం కంటే ముందే పైదేశంలో పాతకోర్సుకి విలువ పడిపోయిందనే పుకార్లు దేశంలోకి వచ్చేస్తాయి. ఒక్కోక్కప్పుడు వట్టి పుకార్లు కూడా ఆర్థికవ్యవస్థని నిర్దేశిస్తాయి. ఈ రంగంలో నిరుద్యోగుల్ని నిరంతరం వేధిస్తాయి. పాతవాటితో ఉద్యోగాలు లేవు. కొత్తవి నేర్చుకున్నా నైపుణ్యం చాలదు. మళ్లీ డబ్బు తే అంటారు. ఉద్యోగం వచ్చే వరకు వస్తుందో రాదో అన్న భయం. వచ్చాక ఆ ఉద్యోగం ఎంతకాలం నిలబడుతుందో తెలీని గందరగోళం.''

ఉన్నట్టుండి గోపీ ఒక్కోసారి ఇలా ఎందుకు మారి పోతాడో తెలీదు. వాడి ధోరణి చూస్తే నాకే ఒక్కోసారి భయమేస్తుంది. పెదనాన్న మాత్రం నిర్లిప్తంగా నవ్వి అడిగాడు....

''ఇప్పుడు చదివిన చదువుకు మరో మంచి ఉద్యోగం దొరకదంటావు.''

''ఎందుకు దొరకదు పెదనాన్నా! ప్రపంచం నిండా సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు కుప్పలు పోసి ఉన్నాయి. బ్యాక్‌డోర్‌లో ఉద్యోగాలు లక్షలు.''

''అంటే లంచమా?''

''కాదు పెదనాన్నా! ఇది ఐటీ ఫీల్డ్‌లో ఇప్పుడే మొదలైన కొత్త ట్రెండ్. మనం దాచుకున్న డబ్బుల్తో వ్యాపారం చేసి బ్యాంకు వాళ్లు మనకే అప్పులిచ్చినట్లు వీళ్లు మనదగ్గర డబ్బు తీసుకుని మనకే ఉద్యోగాలిస్తా రన్నమాట. ఇదివరకు ఉద్యోగాల కోసం అధికారు లకు లంచమిచ్చేవాళ్లం. ఇప్పుడు దళారీల ప్రమేయం లేకుండా యజమానులే లంచం తీసుకుంటారన్న మాట.''

''అయితే డబ్బు కడదామంటావా?''

''వద్దులే నాన్నా... అందులో చాలా మోసా లుంటాయి'' గోపీ వారించాడు.

''మరేం చేస్తావురా?''

''నీతో వచ్చేస్తాను.''

''తప్పు. ఇన్నాళ్లూ పడ్డ శ్రమంతా బూడిదలో పోసిన పన్నీరవుతుంది.''

ఇక లాభం లేదని నేను అందుకున్నాను. ''అసలు వీడ్ని అమెరికా పంపిస్తే బాగుంటుంది పెదనాన్నా!''

''అక్కడ ఉద్యోగాలు ఉన్నాయా?''

''ఉన్నాయా..... అసలు మాలాంటి వాళ్లందరికీ ఉద్యోగాలు ఉన్నవే అక్కడ. అమెరికా సంయుక్త రాష్ట్రాలు సాఫ్ట్‌వేర్ కుర్రాళ్ల కలల కోటలు. కిందటేడు (2002వ సంవత్సరం) ప్రపంచ దేశాలన్నింటి నుంచి ఉద్యోగాల కోసం అమెరికా వెళ్లిన కుర్రాళ్లు లక్షా తొంభై అయిదువేల మంది. వేరేవంక పెట్టుకుని వెళ్లి, ఉద్యో గాల్లో సెటిలైపోయినవాళ్లు ఈజీగా ఇంకో ఏభైవేల మంది ఉంటారు. వీళ్లందరిలో డెబ్భైశాతానికి పైగా కుర్రాళ్లు సాఫ్ట్‌వేర్ వాళ్లే. వాళ్లలో ఏభైశాతానికి పైగా మన ఇండియన్సే.''

''ఈ కాకిలెక్కలన్నీ కావురా. అక్కడికెళ్లాలంటే ఎంత ఖర్చవుతుంది అదిచెప్పు ముందు.'' పెదనాన్న కాస్తంత చిరాగ్గా అన్నాడు. కానీ మనం ఊరు కుంటేగా.... అమెరికా పేరెత్తితే చాలు ఈ మధ్య పూనకం వస్తోంది.

''ముందే ఉద్యోగం దొరికేస్తే మనకేం ఖర్చు కాద నుకో. కానీ ఈ సంవత్సరం ఇప్పటికే అమెరికన్ కాన్సులేట్ లిమిట్ దాటి హెచ్1బి వీసాలిచ్చేసింది. అక్కడి కంపెనీలేమో ఇంకొంతమందికి వీసాలివ్వాల ని డిమాండ్ చేస్తున్నాయి. కానీ ఈ ఇండియన్ల వల సలు అడ్డుకోవాలని అక్కడ ప్రజాసంఘాలు గొడవ చేస్తున్నాయి. కాబట్టి ఈ సంవత్సరం వర్క్‌వీసాలు దొరక్కపోవచ్చు.''

''ఒరేయ్'' అరిచినంత పనిచేసి అన్నాడు గోపీ, ''నాన్నని విసిగించకుండా తిన్నగా చెప్పి చావు. వీడు విదేశాల్లో చదువులకు వీసాలిప్పించే కన్సెల్టెన్సీలో పనిచేస్తున్నాడు నాన్నా! అక్కడ చేరి అమెరికా పైత్యం తలకెక్కించుకున్నాడు. ఎవడైనా అమెరికా పంపిస్తా నంటే చాలు.... ఏ పనిచేయడానికైనా సిద్ధమైపోతు న్నాడు. ఒరేయ్ తిన్నగా చెపుతావా.... నాలుగు తగి లించమన్నావా?''

''సరే చెపుతా విను పెదనాన్నా! ఇక్కడే ఉండి అమెరికాలో ఏదో ఒక యూనివర్సిటీలో సీటు సంపా దిస్తే ఎడ్యుకేషన్ వీసా తేలిగ్గా దొరుకుతుంది. ఏదో ఒకవిధంగా అక్కడ అడుగుపెడితే ఆ తర్వాత మెల్లిగా ఉద్యోగం సంపాదించి, హాయిగా అక్కడే సెటిల్ అయిపోవచ్చు.''

''ఎంత ఖర్చవుతుంది?''

గోపీ ఆ సంఖ్య చెప్పాడు.

''అయితే మీరిద్దరూ ముందుగానే అనుకున్నార న్నమాట. నీకిష్టమేనా?''

గోపీ మాట్లాడలేదు.

''నువ్వు పంపిస్తానంటే వాడు తప్పకుండా వెళ తాడు పెదనాన్నా! మా కన్సల్టెన్సీ డైరెక్టర్‌తో అంతా మాట్లాడాం. మా క్వాలిఫికేషన్లన్నీ సరిపోతాయని ఆయన చెప్పాడు. మా నాన్న తనవల్ల కాదనేశాడు.



## ఇంటా బయటా..

**పుట్టిల్లు ఇండియా కానీ నేపాల్ కానీ ఏదైనా అనుకోనివ్వడండి ఇంటా బయటా ఇప్పుడు ఇబ్బందిగానే వుంది ఆ సుందరికి. బాలీవుడ్‌లో ఓ వెలుగు వెలిగిన మనీషా కొయిరాలా ఇప్పుడు సినిమా అవకాశాలు రాక ఓవైపూ, నేపాల్ రాజుకు సపోర్ట్ చేసిన వైనం మరోవైపూ తెగ ఇబ్బంది పెడుతున్నాయి. తనకొద్దీ తనుండక రాజు జ్ఞానేంద్ర పాలనే నయమని చెప్పి నేపాలీల ఆగ్రహానికి గురైంది. బాలీవుడ్‌లో అయితే మనీ షాకు సినిమా అవకాశమిచ్చే నిర్మాతలే కరువ య్యారు. ఏంచేయాలో దిక్కుతెలియక తల పట్టుకు కూర్చుందిట పాపం. అయినా సిని మాల్లో వుండక రాజకీయాల్లో తలదూర్చడ మెందుకని చెబుతున్నారు తోటి బాలీవుడ్ నటీ మణు. ఈ విషయం తెలుసుకున్న మనీషా... ఆపద వచ్చింతర్వాత అందరూ సలహాలు చెప్పే వాళ్లే. అదే ముందు చెప్పి వుండచ్చు కదా అంటూ మూతి విరుస్తోంది.**

అయినా మా డైరెక్టర్ తన దగ్గర రెండు సంవత్సరాలు పనిచేస్తే నన్ను కూడా పంపిస్తానని ప్రామిస్ చేశాడు'' చెప్పాను నేను.

పెదనాన్న అప్పటికేమీ మాట్లాడకుండా ఊరుకున్నాడు. ఆ సాయంత్రమే ఊరెళ్లిపోయాడు. సరిగ్గా వారం రోజుల తర్వాత గోపీ పేరుమీద ఓ కవర్ వచ్చింది. అందులో ఇలా ఉంది....

''చిరంజీవి గోపీని మీ నాన్నా చిరాయువుగా దీవించి వ్రాయునది. ఉభయకుశలోపరి. మీరు చెప్పిన డబ్బుకి డిడి తీసి పంపుతున్నాను. పొలం అమ్మేశాను. వర్షాలు కురవక, ఎలాగూ వ్యవసాయం నష్టాల్లోనే సాగుతోంది. అందుకు బాధపడకు. ఇన్నాళ్లుగా అన్నం పెడుతున్న వృత్తి ఉండనే ఉంది కదా! కాకపోతే ఈ మధ్య పల్లెటూళ్లన్నీ కబేళాలయిపోతున్నాయి. అశుభాలకే గాని ఏ శుభకార్యానికీ పల్లెలో గిన్నె నోచుకోవడం లేదు. పట్నంలో పెళ్లిళ్లకి పాశ్చాత్య ఫ్యాషన్లు వచ్చేశాయి. పేరుకే పప్పన్నం... అన్నం, పప్పు రెండూ వండించి, వడ్డించే నాథుడు లేడు. కొత్త కుర్రాళ్లతో పోటీ పడలేక కాదు... మనకవన్నీ సరిపడవనిపించింది. నీకు పంపగా మిగిలిన డబ్బుతో ఓ ఆవుని బేరం చేశాను. ఏదో ఒకరకంగా నాకు గడవకపోదు. కాకుంటే ఒకటి. మరో సందర్భం ఏదైనా వస్తే మరోసారి ఇంతమొత్తం నీకివ్వగలిగే స్థితిలో నేనుండకపోవచ్చు. నీ ఎదురుగా ఇదంతా చెప్పలేక ఇలా ఉత్తరం రాస్తున్నాను. ఇవన్నీ మనసులో పెట్టుకోకు. ఒక్కటి మాత్రం గుర్తుపెట్టుకో. బ్రతకడానికి ఈ ప్రపంచంలో చాలా దార్లుంటాయి. కానీ మనిషి జీవించడం ప్రధానం. మనిషిలా జీవించగలగడం ప్రధానం. తాత్కాలికమైన అపజయాలను లెక్కచేయనక్కరలేదు. నువ్వు సాధించగలవనే నమ్మకం నాకుంది. సత్యం బాబాయి గారింట్లో అంతా కులాసా. సూరిని అడిగానని చెప్పు. ఇంతే సంగతులు.

ఇట్లు
మీ నాన్న
గురునాథం వ్రాలు

★★★

''మొగుణ్ణి కొంగున కట్టేసుకున్న నెరజాణ స్వాధీనపతిక.... ఉల్లికారం లాంటిది. దేనిలోనూ నంజుకోవడానికి పనికిరాదు... దానికదే తింటేనే టేస్ట్. ఇండివిడ్యువాలిటీ ఉన్నది.

ప్రియుడు వచ్చేసరికి సింగారించుకుని కూర్చునేది వాసక సజ్జిక. గారె కంటే ముందే విస్తట్లో పడ్డ అల్లప్పచ్చడి.

ప్రియుని ఆలస్యానికి తట్టుకోలేనిది విరహోత్కంఠిత. మిగిలిన పదార్థాలన్నీ వడ్డించేలోపు ఆత్రపడి నాలిక్కి రాసుకుని ఆ తర్వాత అలక్ష్యం చేసే నిమ్మకాయ కారం.

దుఃఖంతో తడిసిపోవడం, క్రోధంతో రగిలిపోవడం విప్రలబ్ధ లక్షణాలు. సరిగ్గా నీళ్లావకాయ కూడా అలాంటిదే. తింటున్నంతసేపూ దాని ఘాటుకి కళ్లనీళ్లెట్టుకోవాలి. తిన్నాక వేడిచేసి బాధపడాలి.

ఇంతసేపూ ఎవత్తితో గడిపి వస్తువన్నావంటూ లేనిపోని నిందలేసి భర్తను సాధించేది ఖండిత.... చింతకాయ పచ్చడి. వేరే పచ్చళ్లు ఉన్నంతసేపూ తనని పట్టించుకోలేదనే కోపంతో గొంతులో గట్టిగా దిగుతుంది.

ఎదురుగా ఉన్నప్పుడు నానామాటలు అనేసి ఆనక నాలిక్కరుచుకునేది కలహాంతరిత. పచ్చిమిరపకాయ పచ్చడి. తింటున్నంతసేపూ కారం పుడుతుంది. తిన్నాక మరికొంచెం కావాలనిపిస్తుంది.

పరాయిచోట ఉన్న ప్రియుణ్ణి తలుచుకుని దుఃఖపడేది ప్రోషితభర్తృక. ఇది పెరుగుపచ్చడి. చివరిగా తిందాంలే అనుకుంటూనే ఆదమరుపుగా వదిలేసేది.

ఇక ఆఖరుగా కొత్తిమీర పచ్చడి అభిసారిక. తనంత తానుగా ప్రియుడ్ని అనుసరించి వెళ్లేది. ఎందులో నంజుకున్నా బాగుంటుంది.'' శంకరం గారు పూర్తిచేశారు.

ఈవేళ వాళ్లిద్దరూ మళ్లీ వచ్చారు. వచ్చీరాగానే చర్చ ఇటు మళ్లింది. నాకూ ఆసక్తిగా అనిపించి అక్కడే నిలబడి వింటున్నాను.

నవ్వుకుంటూ ఇంతసేపూ వింటున్న శాస్త్రిగారు సంతోషం ప్రకటిస్తూ అన్నాడు. ''శెభాష్ బావా శెభాష్. అష్టవిధ శృంగార నాయికల్ని గురించి ఎంతో సరసమైన వివరణలు విన్నాను. కానీ ఇంత రుచికరమైన వర్ణనలు చేసిన మగాడివి నువ్వేనోయ్'' అని కాసేపాగి మళ్లీ అడిగాడు. ''అయితే బావా! ఇన్నేళ్లూ నీ తెలుగు పాఠాలన్నీ ఇలాగే చెప్పావా?''

''ఆ.... ఈ కాలం కుర్రాళ్లకి ర్యాంకుల గోలే తప్ప ఇంత సోది వినే తీరిక లేదురా.''

''పోన్లే బావా! అది సరే కూరలన్నీ వదిలేసి నాయికల్ని వట్టి పచ్చళ్లతోనే పోల్చావేం?''

''చారు, పచ్చడి ఆధారాలు కావు కానీ ఆదరువులే. మగాడి జీవితంలో ఆడది కూడా అంతే! ఆమే జీవితం కాదు.... ఆమె లేకుండా జీవితం సంపూర్ణమూ కాదు.''

ఇద్దరూ కాసేపు మౌనంగా ఉన్నారు. ''సార్! హీరోయిన్లయిపోయారు. మరి హీరోల గురించి చెప్పండి'' ఆసక్తిగా అడిగాన్నేను.

> **''మొగుణ్ణి కొంగున కట్టేసుకున్న నెరజాణ స్వాధీనపతిక.... ఉల్లికారం లాంటిది. దేనిలోనూ నంజుకోవడానికి పనికిరాదు... దానికదే తింటేనే టేస్ట్. ఇండివిడ్యువాలిటీ ఉన్నది. ప్రియుడు వచ్చేసరికి సింగారించుకుని కూర్చునేది వాసక సజ్జిక. గారె కంటే ముందే విస్తట్లో పడ్డ అల్లప్పచ్చడి.**

''ధీరోదాత్తుడంటే పరమపావన మూర్తి శ్రీరామచంద్రుడే. మంత్రాల్లో తారక మంత్రాన్ని మించింది లేదు. తెలుగు కూరల్లో పనసపొట్టును కొట్టింది లేదు. అరటికాయ ఆవకూర ధీరోద్ధతుడు.... యమావేడి. ధర్మజుడు పాలుపోసిన ఆనపకాయ కూరలా ధీరశాంతుడు. చలవచేస్తుంది. ధీరలలితుడు దోసకాయ. అంతా నేనే, అన్నీ నేనే అనిచెప్పిన శ్రీకృష్ణ పరమాత్మలా పప్పులో, కూరలో, పచ్చళ్లో అన్నింట్లో వ్యాపించి ఉంటుంది. వీళ్లే చతుర్విధ శాకనాయకులు.'' చెప్పాడాయన.

''చేసేవాడు వట్టి తిండియావ అనుకుంటాడు కానీ చూడబోతే అంతా తిండిలోనే ఉన్నట్లుందేం బావా! ఒక పక్క భక్తి, మరోపక్క రక్తి.''

''అంతేనా! ారతీయ వేదాంతం ఉంది. వారి విజ్ఞాన, వికాస మూలాలు కూడా ఈ తిండిలోనే ఉన్నాయి'' అన్నాడు శంకరం గారు.

''ఏమిటది?'' శాస్త్రిగారు, నేను ఒకేసారి ప్రశ్నించాం.

''అన్నబ్రహ్మే దివ్యజ్ఞానాత్ – పరబ్రహ్మ స్వరూపమైన అన్నం దివ్యజ్ఞానానికి హేతువు. దేవతలు పరోక్షప్రియులని వేదం చెప్పింది. ఇంద్రియాలను సంతృప్తి పరిస్తే దైవాన్ని సంతృప్తి పరిచినట్లే. పంచేంద్రియాల్లో ఒకటైన జిహ్వను సంతృప్తి పరచడమే భోజనం. శివోహం అంటుంది అద్వైతం. జీవాత్మవైన నీలోనే పరమాత్ముడున్నాడు. ఆ పరమాత్ముడ్ని సేవించడానికి ఇదొక మార్గం. అందుచేత ఆకలితో ఉన్నవాడికి అన్నం పెట్టడం, స్వయంగా తాను తినడం కూడా దేవతారాధనే.''

''మొత్తం మీద బావా! షడ్రసోపేతమైన భోజనం.... షోడశోపచార పూజ రెండూ ఒకటేనంటావు. అయితే ఈ సౌభాగ్యం తెలుగువాడికొక్కడికేనా?''

''భారతీయమైన భోజనం అంతటికీ ఆ పవిత్రత దక్కుతుందిరా. భిన్నత్వంలో ఏకత్వం ఈ దేశంలో అన్ని విషయాల్లోనూ ఉంది. పూర్వం మనవాళ్లు తప్పేలా రొట్టెలని చేసేవాళ్లు. బొగ్గులమీద ఇత్తడి గిన్నె బోర్లించి రొట్టె దానికి అతికించి కాల్చేవారు. దాన్నే ఉత్తరాది వాడు తండూరీ రోటీ అంటున్నాడు. వాళ్ల ఉప్మా మన పిండిలోనుంచి వచ్చిందే. ఇడ్లీకి మన ఆవిరికుండుం అన్నగారు. తెలుగు వ్యాకరణ పరిభాషలో చెప్పాలంటే తప్పేలా రొట్టెలు, తండూరీ రోటీలు తత్సమాలు. ఉప్మా, ఇడ్లీలు మన పిండి, ఆవిరికుడుంలకి తద్భవాలు.''

అన్నం తింటున్న సంగతే మర్చిపోయి రెండు చేతుల్తో చప్పట్లు కొట్టాడు శాస్త్రిగారు. ఉన్నట్టుండి ఏదో అనుమానం వచ్చినట్టు ఆగి అడిగాడు. ''మన తిండిలో విజ్ఞానమూలాలు ఉన్నాయి. ఇదేనా విజ్ఞానమంటే....''

శంకరంగారు నవ్వి ఇలా చెప్పాడు– ''మనిషికి జ్ఞానాన్నిచ్చేవి జ్ఞానేంద్రియాలు. కళ్లు, ముక్కు, చెవులు, నాలుక, స్పర్శ. మానవుడు ఏం తెలుసుకున్నా వీటితోటే తెలుసుకుంటాడు. సగం వయసయ్యేసరికి చూపు మందగిస్తుంది. వినికిడి తగ్గుతుంది. ముడతలు పెరిగేకొద్దీ చర్మానికి స్పర్శజ్ఞానం తగ్గిపోతుంది. కానీ చివ్వరివరకు పనిచేసేవి ముక్కు, నాలుకలే. అంటే మనిషి ఈ రెండింటి ద్వారా సంపాదించే విజ్ఞానమే అధికమని తేలిపోతోంది కదా! అందుకే నాలికకు షడ్రుచులనూ సమానంగా రుచి చూపించాలి. దుర్గంధాలకు దూరంగా ఉండాలి. పీల్చే గాలిలో పెరిగిపోతున్న కాలుష్యం మేధస్సును ప్రభావితం చేస్తోంది. తినే తిండి ఆలోచనలో పరిణతిని తగ్గిస్తోంది. అందుకే ప్రపంచాన్ని శాసించగలిగే ఒకనాటి మన విజ్ఞానమంతా ఇప్పుడ పరాయిదేశం వాడికి ఊడిగం చేస్తోంది. వాడిచ్చే డాలర్లకు ఆశపడి, ప్రకృతి ధర్మాలను విస్మరించి యువతరం బిపిఓల్లో అర్ధరాత్రిళ్లు ఆపసోపాలు పడుతోంది.''

మేమిద్దరం ఆలోచనలో పడ్డాం. వాళ్లిద్దరి భోజనం ఎప్పుడో ఆగిపోయింది. పిల్లలున్న తండ్రులు

వాళ్లిద్దరూ.... ఏం గుర్తుకొచ్చిందో కళ్లు చెమ్మగిల్లుతుండగా మౌనంగా ఉండిపోయారు. వాతావరణాన్ని కొంచెం తేలిక చేద్దామని నేనే అన్నాను.

''ఈరోజు స్పెషల్ అంటుపులుసు... వడ్డించమంటారా?''

అంటుపులుసు పేరుచెప్పగానే శంకరంగారిలో చలనం వచ్చింది. ఆనందంగా 'ఏదీ పట్రా' అన్నాడు. వాళ్లిద్దరూ తింటున్నారు. కొంతసేపటి తర్వాత.....

''శాస్త్రీ! నేను జీవితంలో భయంకరమైన పాపం చేశానోయ్'' అకస్మాత్తుగా అన్నాడు శంకరం గారు.

''అదేమిటి బావా!''

''అవును. రిటైరైపోయాక మనకు ఇక్కడేం పని? హాయిగా మనూరికి పోదాం అనుకునే వీలు లేకుండా అక్కడ ఆస్తులన్నీ అమ్మేశాను. సర్వీసులో ఉండగానే సిటీబయట ఇల్లు కట్టాను. కన్నతల్లిలాంటి ఊరు రొమ్ముమీద గుద్ది నగరానికి బానిసనైపోయాను. ఇక్కడ ఉండి ఏం బావుకున్నాను.... పాత అలవాట్లన్నింటికీ ఏనాడో గుడ్‌బై చెప్పేశాను. కడుపు నిండా తిండితో సహా సమస్త విషయాల్లోనూ రాజీ పడిపోవడం నేర్చుకున్నాను. ఎలక్ట్రానిక్ సంసారానికి అలవాటు పడ్డాక మీ అక్కయ్యకు వంటలో ఆసక్తి పోయింది. వయసు మీద పడ్డాక చేసే శక్తి పోయింది. మా పెద్దమ్మాయి వంటచేస్తే అచ్చం మా అమ్మ చేసినట్టుండేది. ఇప్పుడామె అమెరికాలో ఉంది.'' శంకరం గారి కళ్లు శూన్యాన్ని చూస్తున్నాయి.

''అన్నీ మనకు అనుకూలంగా జరిగేటట్లయితే అది జీవితం కాదు బావా!'' ఓదార్పుగా అన్నాడు శాస్త్రి గారు.

ఇద్దరికీ పెరుగు వడ్డించాను.

''మళ్లీ ఇన్నేళ్లకు ఇతగాడెవడో నాకోసమే ఈ హోటల్ పెట్టాడనిపిస్తోందిరా శాస్త్రీ! ఎక్కడి నుంచి పట్టుకువస్తాడో తెలీదు... అన్నీ స్వచ్ఛమైన, తాజా పదార్థాలే వడ్డిస్తాడు... నోటికి రుచికరంగా, ఒంటికి ఆరోగ్యకరంగా మళ్లీ జన్మలో తినలేనేమో అనుకున్న తెలుగింటి తిళ్లన్నీ గుర్తుచేసి మరీ తినిపిస్తున్నాడు. అరవయ్యో పడిలో ఇరవయ్యేళ్ల వయసు నాటి తిండి తింటున్నాను. ఆ పుణ్యాత్ముడు పది కాలాలపాటు చల్లగా ఉండాలని కోరుకుంటున్నాను.''

''ఎవరు బావా?''

''ఈ హోటల్ ఓనర్.''

''అదే ఎవరు అని.''

''ఏమో తెలీదు. ఇన్నాళ్లుగా రోజూ ఇక్కడికి వస్తున్నా ఒక్కసారీ అతను ఎదురుపడలేదు.''

''అర్జెంటుగా తెలుసుకో. అమ్మాయి పెళ్లి బావా! అసలు సంగతి ఇంతసేపూ మరిచేపోయాం.''

ఈ ప్రస్తావన రాగానే అక్కడినుంచి వెళ్లిపోదామని ప్రయత్నించాను. కానీ వాళ్లిద్దరూ వదిలిపెట్టలేదు.

''ఆయన పెళ్లివంటలు ఒప్పుకోవడం మానేశారండీ.''

''ఎంచేతా?''

''ఈ హోటల్ తెరిచిన దగ్గర్నుంచీ ఆయన ఎక్కడికీ వెళ్లలేదు.''

''పోనీ అడిగి చూద్దాం.''

''లాభంలేదు. ఆయన ఎవరితోనూ మాట్లాడరు.''

''ఎంచేతా?''

''.... మూడేళ్లు పూర్తయ్యింది.... ఆయన నోటి వెంట ఒక్క పలకరింపు విని.''

''అదే ఎంచేతా అని.''

''.......''

''ఇంతకీ ఎవరయ్యా ఆయన? ఎక్కడివాడు? నా అన్నవాళ్లెవరూ లేరా? ఒంటరిగానే ఉంటాడా? నీకేమైనా బంధువా?''

ఏ ఒక్క ప్రశ్నకీ నేను సమాధానం చెప్పలేదు.

''అసలిలాంటి హోటల్ ఒకటి పెట్టాలనే ఆలోచన ఎలా వచ్చిందోయ్ ఆయనకి?''

ఈసారి కూడా నేను మౌనంగానే ఉన్నాను.

''పోనీ బావా.... మాట్లాడకపోతే మానె. ఆయన్ని ఒక్కసారి చూడాలని ఉంది'' అడిగాడు శాస్త్రిగారు.

''ఒక్కసారి చూపించవోయ్....'' నన్ను అడిగాడు శంకరం గారు.

వాళ్లిద్దర్నీ లోపలి గదిలోకి తీసుకువెళ్లి చూపించాను. అక్కడ అప్పుడు తద్దినం జరుగుతోంది. గుమ్మంలోనే చూసి వెనుదిరిగి వచ్చారు వాళ్లిద్దరూ.

''అయితే ఆయనకి కొడుకులు లేరూ?''

''ఉండేవాడు ఒకప్పుడు.... చనిపోయాడు!'' ఒక్కొక్క మాటా గుండెను కోసుకుంటూ నోటివెంట ప్రాణం లేకుండా వస్తోంది.

''ఎలా పోయాడు పాపం?''

''ఆదరించి చేరదీసిన పెంపుడు పాము విషం కక్కింది.''

''అదేంటి?''

''తల్లి, తండ్రి తానే అయి పెంచిన ఒక్కగానొక్క కొడుకుని పెద్ద పదవుల్లో చూడాలనుకున్నాడు తండ్రి. జన్మంతా కూడబెట్టుకున్న డబ్బంతా పోగు చేసి కొడుకు చేతికిచ్చాడు. ఆ కొడుకేమో స్నేహితుడని నమ్మి, నిన్ను అమెరికా పంపిస్తా, అందలాలెక్కిస్తా అని ఆశపెట్టిన ఓ దుర్మార్గుడి చేతికి డబ్బంతా అప్పజెప్పాడు. వాడేమో ఇదుగో అంతా నీ పేరనే చేస్తున్నానని నమ్మబలికి మొత్తం డబ్బు తనకోసం ఖర్చుపెట్టుకున్నాడు.

''అంతేమరి... డబ్బుకి చుట్టాలెవ్వరూ లేరు కదా!''

''తండ్రి జీవితకాల సంపాదన అలా చెయ్యిజారిపోయింది. ఉన్న ఒక్క ఆధారం పోయింది. తన భవిష్యత్తు ఏమిటనే భయం కంటే తండ్రికి ఏం సమాధానం చెప్పాలి అన్న ఆలోచనే కొడుకుని ఎక్కువ బాధించింది. కొడుకు నుంచి వచ్చే శుభవార్త కోసం పల్లెటూళ్లో ఆశగా ఎదురుచూస్తున్న ఆ తండ్రికి కొడుకు ఆత్మహత్య చేసుకున్నాడనే వార్త వినిపించింది.''

చెప్పవలసిన అసలు మాటల కోసం హృదయం పరితపిస్తుంటే గొంతు మాత్రం పూడుకుపోతూ సత్యావిష్కరణను అడ్డుకునే ప్రయత్నం చేస్తోంది.

''ఇటువంటి మంచివాళ్లకి అన్యాయం చేసినవాడెవడో బాగుపడడయ్యా'' ఆవేశంగా అన్నాడు శాస్త్రి గారు.

''వాడేం బావుకుంటాడు లెండి. తానే ఓ మోసగాడైతే, తనకంటే పెద్ద మోసగాడి చేతిలో తాను మోసపోయాడు. ఖండాలు దాటి ఎగిరిపోవాలని ఆశపడ్డవాడు బొంబాయిలోనే బొక్కబోర్లా పడ్డాడు. అరేబియా సముద్రంలో దూకి చావాల్సినవాణ్ణి ఏ రుణానుబంధమో వెనక్కు లాక్కువచ్చింది. వచ్చి చూసేసరికే అంతా అయిపోయింది. అన్నం పెట్టిన ఆదరించిన స్నేహితుని బలవన్మరణానికి తాను కారకుణ్ణయ్యానని తెలుసుకున్నాడు. చేసిన తప్పుకు శిక్ష విధించమంటూ ఆ తండ్రి ముందు శిరసువంచి నిలబడ్డాడు.''

''వాడేం బావుకుంటాడు లెండి. తానే ఓ మోసగాడైతే, తనకంటే పెద్ద మోసగాడి చేతిలో తాను మోసపోయాడు. ఖండాలు దాటి ఎగిరిపోవాలని ఆశపడ్డవాడు బొంబాయిలోనే బొక్కబోర్లా పడ్డాడు. అరేబియా సముద్రంలో దూకి చావాల్సినవాణ్ణి ఏ రుణానుబంధమో వెనక్కు లాక్కు వచ్చింది. వచ్చి చూసేసరికే అంతా అయిపోయింది.

''నరికి చంపాల్సింది దుర్మార్గుణ్ణి.''

''ఆనాడాయన అలాగే చేసివుంటే వాడు చేసిన తప్పుకు శిక్ష మాత్రమే పడేది. ఈనాటి తెలుగు ఫలహారం కథ ఉండేది కాదు. ఈ కథ చెప్పే మనిషీ ఉండేవాడు కాదు.''

''ఏమిటయ్యా నువ్వనేది?''

''అవును ఈరోజు మీముందిలా నిలబడి ఉన్న నేనే.... ఆరోజు పెదనాన్న కళ్లల్లో మహోన్నత మానవతా తేజం వెలుగుతూ ఉండడం చూశాను. ఆయనలో రూపుకట్టిన క్షమాగుణ స్వరూపాన్ని చూశాను. భయంతో, నామీద నాకే అసహ్యంతో ఇంతకంటే చావే మేలని నిశ్చయించుకున్న నన్ను చూసి పెదనాన్న అన్నాడు....

ఒక ప్రాణం తీసినందుకు చెల్లించాల్సిన మూల్యం మరో ప్రాణం బలివ్వడం కాదు. కూడని దానిపై నువ్వు పెంచుకున్న వ్యామోహం నీ స్నేహితుని ఉసురు తీసింది. అటువంటి స్నేహితులు ఈలోకంలో ఎందరో ఉన్నారు. వాళ్లలో కొందరి ప్రాణాలైనా కాపాడే ప్రయత్నం చెయ్యి.

దాదాపుగా అదే చివరిసారి పెదనాన్న నోరు తెరిచి మాట్లాడడం.

ఇరవయ్యేళ్ల వయసులో ఆ కొడుకు తన జీవితాన్ని అంతం చేసుకుంటే ఏభై ఏళ్ల వయసులో ఈ తండ్రి తన జీవితాన్ని తిరిగి మొదలెట్టాడు. ఎక్కడైతే తన కొడుకు ఆత్మహత్య చేసుకున్నాడో అక్కడికే వచ్చాడు. సాధించగలిగే సామర్థ్యం ఉండీ పిరికితనాన్ని ఆశ్రయించిన ఎందరో కుర్రాళ్లకి తాను ఆశ్రయం కల్పించాడు. జీవితాన్ని జయించడమెలాగో నేర్పించాడు. చేతిలో చిల్లిగవ్వ లేకుండా నగరానికి వచ్చి, కేవలం మూడు సంవత్సరాల కాలంలో తాను అనుకున్నది సాధించాడు. ఇంకా ఇంకా సాధిస్తాడు. సాధిస్తూనే ఉంటాడు.... మౌనంగానే.''

★